RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -4 సంచిక -1 01 మంగళవారం సెప్టెంబర్ 2026 ఎడిటర్ లక్ష్మి నారాయణ

నిజం మా నిబద్ధత... ప్రజా ప్రయోజనం మా ధ్యేయం...

ది హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

ప్రతి ఇంటికీ... ప్రతి చేతికీ... నిజమైన వార్తలు

మా దినపత్రిక విస్తరణలో భాగంగా

రిపోర్టర్లు కావలెను!

జర్నలిజంపై ఆసక్తి కలిగిన, నిజాయితీ గల, సమాజంపై స్పందన కలిగిన అభ్యర్థులు మా బలమైన బృందంలో చేరండి.

- స్టాపర్లు (స్ట్రింగర్లు)
- మండల రిపోర్టర్లు
- జిల్లా బ్యూరోస్

అన్ని నియోజక వర్గాలలో కావలెను

సంప్రదించవలసిన నెంబర్: 9951693876

ఎడిటర్ లక్ష్మీనారాయణ

పేజీలు - 6 వెల రూ 5 /--



## కరువు సీమలో కృష్ణా జలాలు..

### వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన చంద్రబాబు!

- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం
- నాడు పునాది వేసిన తానే నేడు ప్రారంభించడం అదృష్టమన్న సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వం ఫేక్ ప్రారంభోత్సవంతో ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శ
- 2028 నాటికి రెండో దశ పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా ఇస్తామని హామీ
- నదుల అనుసంధానంతోనే దేశంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమన్న ముఖ్యమంత్రి

ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకున్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపోయిందని భావోద్వేగంగా అన్నారు.

## మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి -కూనంనేని



## విశాఖకు ఏఐజీ..

### రూ.2,000 కోట్లతో వెయ్యి పడకల హాస్పిటల్.. మంత్రి లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన

ఆంధ్రప్రదేశ్ వైద్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. ఆసియాలోనే ప్రసిద్ధి గాంచిన ఏఐజీ (ఏఐజీ) హాస్పిటల్స్ ఇప్పుడు విశాఖపట్నంలో కొలువుదీరనుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ మెగా హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విశాఖ ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.



## పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం:

### - కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఫైర్

- మూసారాంబాగ్ వద్ద కొత్త బ్రిడ్జిని ప్రారంభించిన ముఖ్యమంత్రి
- పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేనిది రెండేళ్లలో చేసి చూపించామన్న సీఎం
- కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారని తీవ్ర ఆరోపణ
- ప్రతి నెలా 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని వెల్లడి



గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట - మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై నూతనంగా నిర్మించిన వంతెనను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల పాలనలో సాధ్యం కాని పనులను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే పూర్తి చేసి చూపిందని పేర్కొన్నారు.

## అంతులేని యుద్ధం కాదు.. యుద్ధానికి ముగింపు కావాలి:

- పుతిన్‌తో మోదీ-ఉక్రెయిన్ యుద్ధంపై పుతిన్‌కు మోదీ స్పష్టమైన సందేశం
- అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి ముగింపు వైపు వెళ్లాలన్న మోదీ
- శాంతియుత పరిష్కారాలకే భారత్ మద్దతు ఇస్తుందని వెల్లడి
- ఎస్‌సీఓ సదస్సు వేదికగా ఇరువురు నేతల భేటీ

కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన దౌత్యపరమైన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి స్వస్తి పలికే దిశగా అడుగులు వేయాలి" అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ సూచించారు.



## రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

- ప్రజల అభిప్రాయాలు, డేటా ఆధారంగా పౌరసేవలు మెరుగుపరచాలని సీఎం ఆదేశం
- పారిశుద్ధ్యంపై రాజీ లేదని, సంక్షేమ హాస్టళ్లలో నెలకోసారి పేరెంట్స్ మీటింగ్ పెట్టాలని సూచన



## రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన



## 'అసలైన శత్రువు ఎవరో గుర్తించండి'..

### ముస్లిం దేశాలకు ఇరాన్ సుప్రీం లీడర్ పిలుపు

అమెరికా, ఇజ్రాయెల్‌పై పోరాటానికి ఏకం కావాలని ముస్లిం దేశాలకు ఇరాన్ పిలుపు



# విశాఖకు ఏఐజీ..

**రూ.2,000 కోట్ల పెట్టుబడి, 9,000 ఉద్యోగాలు**

విశాఖలో నెలకొల్పనున్న ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోసం ఏఐజీ యాజమాన్యం ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. నిర్మాణం పూర్తయితే వెయ్యి పడకల సామర్థ్యంతో ఇది ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద వైద్య కేంద్రాల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడగలదని అంచనా వేస్తున్నారు.

**రెండు దశల్లో నిర్మాణం.. ప్రపంచ స్థాయి సేవలు**

హాస్పిటల్ నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశలో 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి సేవలు ప్రారంభించాలని భావిస్తున్నారు. మిగిలిన 350 పడకలతో రెండో దశను ఆ తర్వాత రెండేళ్లలో పూర్తి చేస్తారు. మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో హాస్పిటల్ క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు.

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, 50కి పైగా వైద్య విభాగాలతో ప్రపంచ స్థాయి సేవలు అందించనున్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా ఒకచోట శిక్షణ, పరిశోధన, రోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సదుపాయాలతో ఒక సంపూర్ణ హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నారు.

**ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం**

శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూమి పూజ నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆసుపత్రి నిర్మాణ ప్రణాళికలు, భవిష్యత్ సేవలకు సంబంధించి రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ)ను మంత్రి వీక్షించారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గణబాబు, ఏఐజీ వైస్ ఛైర్మన్ పీవీఎస్ రాజు, డైరెక్టర్ జీవీ రావు, సీఈవో సామ్ రిజ్వీ, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# 'అసలైన శత్రువు ఎవరో గుర్తించండి'..

అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ముస్లిం దేశాలన్నీ ఐక్యంగా నిలబడాలని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. ఈ రెండు దేశాలే ఇస్లామిక్ దేశాలన్నింటికీ ఉమ్మడి శత్రువులని ఆయన అభివర్ణించారు. ముస్లిం దేశాల పాలకులు తమ నిజమైన శత్రువు ఎవరో తెలుసుకోవాలని, వారి ప్రణాళికలను అర్థం చేసుకుని ఎదుర్కోవాలని హితవు పలికినట్లు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ 'ఐఆర్ఎన్ఏ' వెల్లడించింది. టెహ్రాన్‌లో జరిగిన మత పెద్దల సదస్సుకు పంపిన ఒక లేఖలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆరు నెలల క్రితం ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఖమేనీ తండ్రితో పాటు పలువురు సీనియర్ నేతలు మరణించారు. అప్పటి నుంచి ఆయన బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. 6 నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన నుంచి ఈ సందేశం వెలువడటం గమనార్హం. ఈ యుద్ధం ముస్లిం ప్రపంచంలో విభేదాలను బహిర్గతం చేసింది. పొరుగున ఉన్న గల్ఫ్ అరబ్ దేశాల్లోని లక్ష్యాలపై ఇరాన్ దాడులు చేయడం, హర్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలను నియంత్రించడం వంటి చర్యలు ఈ చీలికలకు కారణమయ్యాయి. ఈ ప్రాంతంలో అమెరికా సైనిక ఉనికిని టెహ్రాన్ మొదటి నుంచి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

## మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి -కూనంనేని

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని అన్నారు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అధికారం, హక్కులతో పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. వారికి తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో కొత్త సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు చేయడం సహజమేనని అన్నారు. అయితే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో భూ సమస్యలపైనా కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

## రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. ఇక సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం పులివెందుల నివాసం నుంచి బయలుదేరి 7:45 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. వర్ధంతి కార్యక్రమం పూర్తయిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రతీ ఏటా వైఎస్సార్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలకు జగన్ హాజరై నివాళులు అర్పించడం తెలిసిందే.

## రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, డేటా అనలటిక్స్‌ను విశ్లేషించడం ద్వారా ప్రభుత్వ శాఖలు అందించే పౌరసేవలను మరింత మెరుగుపరచాలని, అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో 'రియల్ టైమ్ గవర్నెన్స్' (ఆర్టీజీ)పై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, అల్లూరి విమానాశ్రయం వంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారని, ఇదే స్ఫూర్తిని ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కొనసాగించి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు.

రాష్ట్రంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు తాను 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో 20 సార్లు పాల్గొన్నానని గుర్తుచేశారు. ఇదే క్రమంలో సంక్షేమ హాస్టళ్లలో పారిశుద్ధ్య నిర్వహణను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ప్రతి నెలా మొదటి ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులను హాస్టళ్లకు ఆహ్వానించి, అక్కడి పరిస్థితులు, భోజనం, తాగునీటి సౌకర్యాలపై వివరించాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయన్నారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్ల ద్వారా అన్నార్తులకు సాయం అందించే దాతలను గుర్తించి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు తమ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే అందించాలని చంద్రబాబు ఆదేశించారు. రెవెన్యూ సహా అన్ని విభాగాలు ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీకృత సేవల విధానం ద్వారా ప్రజలకు వేగంగా నిర్ణయాలు అందేలా చూడాలని అన్నారు. పనితీరు ఆధారంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బాధ్యులకు ర్యాంకులు ఇవ్వాలని, లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని సరిదిద్దుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో 'అవేర్' (ూబౌూ=జు) వేదిక ద్వారా రాష్ట్రంలోని సాగు పరిస్థితిని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రకృతి సేద్యం చేసే రైతులను పూర్తిస్థాయిలో ప్రోత్సహించాలన్నారు. ఉద్యాన పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న 5.70 లక్షల ఎకరాల భూమిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అంతులేని యుద్ధం కాదు..

# యుద్ధానికి ముగింపు కావాలి:

ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని యావత్ మానవాళి కోరుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ సంక్షోభ పరిష్కారానికి ఉద్దేశించిన ప్రతి శాంతియుత ప్రయత్నానికి భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. "ఏ సమస్యనైనా శాంతియుత మార్గాల్లోనే పరిష్కరించుకోవాలన్నదే భారత్ నిశ్చితాభిప్రాయం. ఇది సకల మానవాళి శ్రేయస్సుకు అత్యవసరం. యుద్ధం కొనసాగే ప్రతి రోజూ మానవ ప్రగతిని వెనక్కి నెడుతుంది. కాబట్టి దీనికి తక్షణమే ముగింపు పలకాలి" అని మోదీ వివరించారు. గాంధీ, బుద్ధుడు నడయాడిన భారత గడ్డ ఎల్లప్పుడూ శాంతి మార్గాన్నే బోధిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. 2022లో జరిగిన ఎస్‌సీఓ సదస్సులో "ఇది యుద్ధాల యుగం కాదు" అని పుతిన్‌తో మోదీ చేసిన చారిత్రాత్మక వ్యాఖ్యలకు కొనసాగింపుగానే తాజా సందేశం సాగింది. అటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ, ఇటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ జరిపిన ప్రతి సంభాషణలోనూ చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం సాధ్యమని భారత్ నొక్కి చెబుతూ వస్తోంది.

# పదేళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేశాం

వర్షం వస్తే మునిగిపోయే పాత వంతెన స్థానంలో నూతన వంతెనను నిర్మించాలని పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు ఆలోచించలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సరైన ప్రభుత్వ కార్యాలయాలు లేవని, స్థానిక ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ప్రభుత్వ భవనాలను నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా, 10 ఎకరాల స్థలంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామని ప్రకటించారు. బతుకమ్మ కుంట కబ్జాకు పాల్పడుతున్న వారి వెనుక ఎవరి హస్తముందో ప్రజలు గమనించాలని ఆయన కోరారు. తాము బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, కనీసం ఏడో తేదీ వచ్చినా ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని దయనీయ స్థితి నెలకొని ఉండేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలించిన 16 మంది ముఖ్యమంత్రులు కలిసి కేవలం రూ. 70 వేల కోట్లు అప్పు చేస్తే, కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. తమ ప్రభుత్వం చెరువులను కబ్జా చేసి విల్లాలు, ఫామ్‌హౌస్‌లు నిర్మించడం లేదని, కేవలం ఆక్రమణలను తొలగించి జలవనరులను కాపాడుతోందని స్పష్టం చేశారు. గతంలో తనను విమర్శించిన ఉద్యోగులే ఇప్పుడు తమ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల పనితీరును బేరీజు వేసుకోవాలని ఆయన ఉద్యోగులను కోరారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

---

# కరువు సీమలో కృష్ణా జలాలు..

1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. "పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను. ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం" అని చంద్రబాబు అన్నారు.

ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసిత ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని, వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని కొనియాడారు. వెలిగొండ అంటే కరవుపై గెలుపు, రైతు భవిష్యత్తుకు నమ్మకం, ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు అని ఆయన అభివర్ణించారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని, 2024 ఎన్నికలతో ఆ గ్రహణం వీడిందని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ప్రభుత్వం కేవలం 2.77 శాతం పనులు చేసి, విలువైన కాలాన్ని గాలికొదిలేసింది. ఎన్నికలకు నెల ముందు రూ.4,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని డ్రామా ఆడింది. ఇది సిగ్గులేనితనం కాదా? కరవు ప్రాంత రైతులతో ఆడుకోవడానికి మానవత్వం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్‌ను తాను స్వయంగా రంగంలోకి దిగి తొలగించానని చంద్రబాబు వెల్లడించారు. ఆ తర్వాత, ఇంకా పనులు మిగిలి ఉండగానే సొరంగాలు మొత్తం తిరిగివచ్చానని, ప్రాజెక్టు సిద్ధంగా ఉందని చెప్పిన ఆనాటి ఫేక్ ముఖ్యమంత్రిని ఏమనాలో మార్కాపురం ప్రజలే ఆలోచించాలని అన్నారు. తన హయాంలోనే ప్రాజెక్టుకు 50 శాతానికి పైగా నిధులు ఖర్చు చేశామని, వాస్తవాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఫేక్ మాటలతో ప్రజలను ఎవరూ మోసం చేయలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.

**వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి**

ప్రాజెక్టుతో లబ్ధి పొందే రైతులు ఎంత సంతోషంగా ఉంటారో, త్యాగాలు చేసిన నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే రూ.768 కోట్లు అందించామని, త్వరలోనే మిగిలిన రూ.165 కోట్లు, రూ.169 కోట్లు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కటాఫ్ డేట్ సమస్యతో నష్టపోయిన వారికి అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఏ ఒక్క నిర్వాసితుడు ఇబ్బంది పడకుండా ఆదుకోవడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని ఆయన పునరుద్ఘాటించారు.

ఎల్ నినో ప్రభావంతో ఎగువన జలాశయాల్లో నీళ్లు లేకపోయినా, కనీసం తాగునీటి అవసరాల కోసం 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తీసుకొస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ నీటితో మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం తలరాత మారుతుందని, ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు.

**అది మోదీతోనే సాధ్యం**

దేశంలో నీటి సమస్యకు నదుల అనుసంధానమే ఏకైక పరిష్కారమని, అది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని చంద్రబాబు అన్నారు. 2027 మార్చి నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, వచ్చే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా జరుపుకోబోతున్నామని ప్రకటించారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానంతో దక్షిణ భారతదేశంలోని నీటి యుద్ధాలకు ముగింపు పలకవచ్చని, ఆ దిశగా కేంద్రంతో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మార్కాపురాన్ని రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగం చేశామని, 2028 నాటికి వెలిగొండ రెండో దశను కూడా పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు.

# గొంతు ఎండుతుంది సార్ మిషన్ భగీరథ నీళ్లు తాగించండి

**నాలుగు రోజులైనా జాడ లేని మిషన్ భగీరథ నీళ్లు ఆరు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని అధికారులు ఎమ్మెల్యే గారు జిల్లా కలెక్టర్ గారు సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.**




**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

భూపాలపల్లి నియోజకవర్గంలో 6 మండలాల ప్రజలు తాగునీరు లేక మిషన్ భగీరథ నీళ్లు రాక నాలుగు రోజుల నుండి గొంతెండుతున్న సంబంధించిన అధికారులు, విద్యుత్ అధికారులు పట్టించుకోనందున స్థానిక ఎమ్మెల్యే గారు జిల్లా కలెక్టర్ గారు వారిపై కఠిన చర్యలు తీసుకొని ప్రజలకు నీళ్లు తాగించాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య కోరారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో మల్లయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏర్పాటుచేసి ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు అందిస్తు అందరికీ నీళ్లు తాగించింది ఈ ప్రభుత్వం లో ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిషన్ భగీరథ నీళ్లు సరఫరా చేసింది కానీ గత మూడు రోజుల నుండి నీళ్లు లేకుండా ఘన్పూర్ మండల్ గాంధీనగర్లో మిషన్ భగీరథ పంపు హౌస్ లో ట్రాన్స్ ఫరం కాలీ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ అధికారులు కానీ మిషన్ భగీరథ అధికారులు కానీ పట్టించుకోక నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన మంచినీళ్లు లేక ప్రజలు అల్లాడిపోతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గారు వెంటనే ఆ అధికారులపై కఠిన చర్యలు తీసుకోని, నీళ్లు అందించి ప్రజల దాహం తీర్చాలని అన్నారు సంబంధించిన అధికారులు విద్యుత్ అధికారులు కూడా తక్షణమే మోటార్ బిగించి అందరికీ మిషన్ భగీరథ నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు

# విద్యార్థుల సమస్యలపై ప్రజావాణికి ఫిర్యాదులు

**- ఉపాధ్యాయుడి నియామకం, పాఠశాల రికార్డులపై విచారణకు వినతి**




**గీసుగొండ, ఆగస్టు 31, హైదరాబాద్ ఎస్టేట్:**
విద్యార్థుల విద్యకు సంబంధించిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ రేవంత్ రాథోడ్ సోమవారం గీసుగొండ మండల ప్రజావాణిలో రెండు వినతిపత్రాలు సమర్పించారు. సమాజ సేవకులు అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి సూచనల మేరకు ఈ వినతులు అందజేసినట్లు తెలిపారు. గంగదేవిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడి పోస్టును వెంటనే భర్తీ చేసి, పదో తరగతి విద్యార్థుల చదువుకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదు డబ్ల్యూ.ఏ.ఆర్.జి. 31082600155 నంబర్తో నమోదై మండల విద్యాశాఖ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. గీసుగొండ మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు సంబంధించిన గుర్తింపు, అనుమతులు, తనిఖీ నివేదికలు, పాఠశాల మార్పిడి ప్రతిపాదన, నిరభ్యంతర పత్రం తదితర అధికారిక రికార్డులపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని మరో వినతిపత్రంలో కోరారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదు డబ్ల్యూ.ఏ.ఆర్.జి. 31082600196 నంబర్తో నమోదై ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు, వరంగల్కు పంపినట్లు తెలిపారు. విద్యార్థుల విద్యా హక్కులు, భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, రికార్డుల ఆధారంగా నిష్పాక్షికంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రేవంత్ రాథోడ్ కోరారు.

## లక్కమారికాపు సంఘ అధ్యక్షుడిగా పురుషోత్తం - నూతన పాలకవర్గం ఎన్నిక



**సంగెం, ఆగస్టు 31, హైదరాబాద్ ఎస్టేట్:**
సంగెం మండలం మొండ్రాయి గ్రామంలోని సీతారామ లక్కమారికాపు పరపతి సంఘం రెండో మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెండ్లి పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యక్షులుగా కడుదూరి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా మామిండ్ల సంపత్, కోశాధికారిగా సింగిరెడ్డి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులుగా కొనుకటి బాలరాజు, గూడ రవిసాగర్, గోనె వీరభద్రయ్య, ఎరుకల రాజమౌళి, ముస్కు రాజు, కూస రాజు, ఏడాకుల శ్రీనివాస్, పెంతల స్వామి, అనుముల రాజు, పెండ్లి రవికుమార్, యార మల్లయ్య, అనుముల యుగేందర్, పొన్నాల హరీష్, కడుదూరి రమేష్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కుల పెద్దలు, పాలకవర్గం, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో సంఘ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.



## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా 'ఫ్లేవర్ ఆఫ్ ఇండియా' వేడుకలు



బర్కత్పుర, ఆగస్టు 31:
బర్కత్పురాలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ (నారాయణగూడ జోన్)లో 'ఫ్లేవర్ ఆఫ్ ఇండియా -- ఎ సెలబ్రేషన్ ఆఫ్ ఇండియాస్ డైవర్సిటీ' పేరిట సాంస్కృతిక వేడుకలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 'మేరా భారత్ -- శ్రేష్ఠ భారత్' స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్ మరియు దేశభక్తి మాసోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో దేశభక్తి, సాంస్కృతిక అవగాహన, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాల వ్యవస్థాపక చైర్పర్సన్లు డాక్టర్ బి.ఎస్. రావు, డాక్టర్ ఝాన్సీ లక్ష్మీ బాయిల స్ఫూర్తితో ఈ వేడుకలు జరిగాయి.
కార్యక్రమంలో విద్యార్థులు తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, జమ్మూ-కశ్మీర్, ఒడిశా, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలను, కళారూపాలను సంప్రదాయ వస్త్రధారణతో కూడిన నృత్య ప్రదర్శనల ద్వారా కళ్లకు కట్టారు. విద్యార్థుల ప్రదర్శనలు పాఠశాల ప్రాంగణంలో 'మినీ భారత్'ను తలపించాయి.
ఈ కార్యక్రమంలో ఏజీఎం నూర్ మహమ్మద్ అలీ, ఆర్ఐ బండి వెంకటేష్, ప్రిన్సిపాల్ ఎ. మాధవి, డీన్ గాయత్రి, ప్రైమరీ ఇన్చార్జ్ సబిత, ప్రీ-ప్రైమరీ ఇన్చార్జ్ మాలతితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రైవేట్ టీచర్లకూ అవార్డులు

**- సేవ ఆధారంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక జరగాలి: శ్రీశైలం**

వరంగల్, ఆగస్టు 31, హైదరాబాద్ ఎస్టేట్:
ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో నిబద్ధతతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించాలని ప్రైవేట్ టీచర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి సింగనబోయిన శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడి సేవలను పాఠశాల స్వభావం ఆధారంగా కాకుండా బోధనా నాణ్యత, విద్యార్థుల ప్రగతి, వినూత్న బోధన, సామాజిక సేవ, విద్యార్థుల్లో విలువల పెంపకం వంటి అంశాల ఆధారంగా గుర్తించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది మంది ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయుల్లో ప్రభుత్వ--ప్రైవేట్ రంగాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేలా పారదర్శక విధానం రూపొందించాలని కోరారు. "ఉపాధ్యాయుడి గొప్పతనం ఆయన పనిచేసే పాఠశాలలో కాదు.. ఆయన తీర్చిదిద్దిన విద్యార్థుల భవిష్యత్తులో ఉంది" అని శ్రీశైలం అన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, పరపల్లి సాంబయ్య, కొనుకటి రాజు తదితరులు పాల్గొన్నారు





# 22/ఏలో చిక్కుకున్న ప్లాట్లు.. బాధితుల కన్నీటి గోడు

**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 31:-**
కొంగరకలాన్: రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్లోని జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం 22/ఏ బాధితుల ఆవేదనకు వేదికగా మారింది. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన భూ యజమానులు, గతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన పలువురు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నో నెలలుగా ప్రజావాణిలో దరఖాస్తులు అందజేస్తున్నా సమస్యలకు పరిష్కారం లభించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ప్లాట్లను ప్రస్తుతం 22/ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో తమ జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయని బాధితులు వాపోయారు. రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిన డబ్బును కూడబెట్టి భవిష్యత్ అవసరాల కోసం స్థలాలు కొనుగోలు చేసుకున్నామని తెలిపారు. అయితే ఇప్పుడు ఆస్తులను విక్రయించేందుకు ప్రయత్నిస్తే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. పిల్లల చదువులు, వివాహాలు, కుటుంబ అవసరాల కోసం తమ స్థలాలను విక్రయించాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ 22/ఏ నిబంధనలు అడ్డంకిగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ఆస్తులను ఒక్కసారిగా నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అర్హత కలిగిన భూములు, ప్లాట్లను 22/ఏ జాబితా నుంచి తొలగించి తమకు న్యాయం చేయాలని బాధితులు ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులను కోరారు

# షాద్నగర్లో పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసన



**హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 31:-**
షాద్నగర్: షాద్నగర్లో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ర్యాలీ, నిరసన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. కళాశాలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ాఖ విద్యార్థి శివ నాయకత్వంలో కళాశాల ప్రాంగణం నుంచి షాద్నగర్ చౌరస్తా వరకు విద్యార్థులు ర్యాలీగా తరలివెళ్లారు. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ ముందుకు సాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ర్యాలీ వెళ్లే మార్గంలో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాహనదారులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు. షాద్నగర్ ాూ సీతారాం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ర్యాలీని పర్యవేక్షిస్తూ బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులతో సమన్వయం చేసుకుంటూ నిరసన కార్యక్రమం సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు కూడా పోలీసులకు సహకరించడంతో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోలేదు. ర్యాలీ అనంతరం విద్యార్థులు తమ నిరసనను కొనసాగించి, సంబంధిత సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు తీసుకున్న భద్రతా చర్యలు ఫలించాయి. షాద్నగర్లో సాధారణ పరిస్థితులు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి 9వ వార్షికోత్సవ వేడుకలు

**హైదరాబాద్ ఎస్టేట్ 31ఆగస్టు**
మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి ఆవరణలోని శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారి 9వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం మరియు సహపంక్తి భోజన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జమీా కిరణ్ రాజ్ మరియు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ సహాయ సహకారాలతో, ఆలయ కమిటీ సభ్యులైన ణఎ సీఎంఓ ఎం. మధుకుమార్, ాతీ.ాూ ఎండీ మదర్ సాహెబ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మేకల రాజయ్య, ఎం. జమదగ్ని, రాయల శ్రీనివాస్, భరత్ తిరుపతి, రమేష్, రఘు, శ్రీధర్, శ్రీకాంత్, శ్రీమతి టి. విజయలక్ష్మి, శ్రీమతి పుష్ప, శ్రీమతి సరోజ, శ్రీమతి సులోచన మరియు శ్రీమతి ప్రమీల ఆధ్వర్యంలో ఈ వార్షికోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో పలువురు అధికారులు, వైద్యులు, ఉద్యోగులు మరియు సిబ్బంది పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన సహపంక్తి భోజన కార్యక్రమంలో మందమర్రి ఏరియా అధికారులు, డాక్టర్లు, ఉద్యోగులు మరియు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించిన సీఎంఓ కిరణ్ రాజ్, జీఎం ఎన్. రాధాకృష్ణ, ఏరియా అధికారులు, వైద్యులు, ఉద్యోగులు మరియు సిబ్బందికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# శిరీషకు న్యాయం జరిగే వరకు పోరాటం

## - ఆదివాసి యువతి మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి: తుడుందెబ్బ

తాడ్వాయి, ఆగస్టు 31, హైదరాబాద్ ఎస్టేట్:
ఆదివాసి యువతి ఉకే శిరీష అనుమానాస్పద మృతిపై నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని తుడుందెబ్బ ఆదివాసి హక్కుల పోరాట సమితి ములుగు జిల్లా అధ్యక్షుడు చందా మహేష్ డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తాడ్వాయి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన శిరీష తుక్కుగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారని తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిజానిజాలను ప్రజల ముందుంచాలని కోరారు. శిరీష మృతికి సంబంధించి షానాద్ ఉల్లా ఖాన్ అనే వ్యక్తి ప్రమేయంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వాటిపైనా లోతుగా విచారణ జరపాలని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ఆదివాసి యువతుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, శిరీష కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు తగిన సహాయం అందించాలని చందా మహేష్ కోరారు. "శిరీష కుటుంబం ఒంటరిది కాదు. న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గం. అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో విస్తృత ఉద్యమం చేపడతాం" అని ఆయన స్పష్టం చేశారు.



సమావేశంలో ఆదివాసి మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమరం లక్ష్మీకాంత, తుడుందెబ్బ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి వట్టం సురేష్, తాడ్వాయి మండల అధ్యక్షుడు చందా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ సమరభేరి

## - సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు వరంగల్ పశ్చిమలో నిరసనలు- పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పోరుబాట సాగించాలి: వినయ్ భాస్కర్

హనుమకొండ, ఆగస్టు 31, హైదరాబాద్ ఎస్టేట్:
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సమరభేరికి సిద్ధమైంది. సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎనిమిది రోజుల పాటు వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపు మేరకు హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించిన వినయ్ భాస్కర్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్ల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిరసన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎనిమిది రోజుల కార్యక్రమాల్లో కాంగ్రెస్



ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి వర్గానికి చేరేలా విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. హామీల అమలులో ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేయాలని వినయ్ భాస్కర్ కోరారు. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, న్యాయ విభాగం బాధ్యులు, మహిళా విభాగం డివిజన్ అధ్యక్షులు, విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో శభాష్ అనిపించుకున్న సుధాకర్

## - పదవీ విరమణ పొందిన పంచాయతీ కార్యదర్శికి ఘన వీడ్కోలు

గీసుగొండ, ఆగస్టు 31, హైదరాబాద్ ఎస్టేట్:
నిబద్ధత, బాధ్యతాయుత పనితీరుతో విధి నిర్వహణలో ప్రత్యేక ముద్ర వేసుకున్న పంచాయతీ కార్యదర్శి భైరబోయిన సుధాకర్ పదవీ విరమణ సందర్భంగా గీసుగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో, ఎంపీవో, కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. గీసుగొండ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామంగా గుర్తింపు పొందిన మరియాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సుధాకర్ బాధ్యతలు నిర్వర్తించారు. గ్రామ పాలనను సమర్థంగా నిర్వహిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరించారని సహచరులు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా కృషి చేశారని తెలిపారు. వీడ్కోలు సమావేశంలో ఎంపీడీవో వెన్న కృష్ణవేణి మాట్లాడుతూ సుధాకర్ తన సర్వీసు కాలమంతా నిబద్ధతతో, బాధ్యతతో పనిచేశారని కొనియాడారు. మరియాపురం గ్రామ అభివృద్ధిలో ఆయన సేవలు ప్రశంసనీయమని, పంచాయతీరాజ్



శాఖకు ఆయన అందించిన సేవలు గుర్తుండిపోతాయని అన్నారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితం ఆరోగ్యం, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఎంపీవో టి. శేషాంజన్ స్వామి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో, గ్రామపంచాయతీ పాలనను పారదర్శకంగా నిర్వహించడంలో సుధాకర్ సమర్థంగా పనిచేశారని తెలిపారు. ఎంతటి క్లిష్టమైన బాధ్యత ఎదురైనా ప్రశాంతంగా, చిరునవ్వుతో పూర్తి చేయడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ఆయన పదవీ విరమణ శాఖకు లోటని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు పోలు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సుధాకర్ తోటి కార్యదర్శులకు మార్గదర్శిగా నిలిచారని అన్నారు. సహచర ఉద్యోగులకు ఎదురైన సమస్యల పరిష్కారానికి ముందుండి సహకరించేవారని గుర్తుచేశారు. ఆయన సేవలను కొనియాడుతూ సంఘం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కమలాకర్, ఏపీవో చంద్రకాంత్, శత్రుఘ్నరెడ్డి, కొండల్‌రెడ్డి, సంధ్యారాణి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈ-పంచాయతీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు. సుధాకర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కాంగ్రెస్ సర్కార్‌కు ఆర్. కృష్ణయ్య హెచ్చరిక

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 31:-
తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హయత్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఫీజు బకాయిల సమస్యపై విద్యార్థులు తరగతులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు.
మీడియాతో మాట్లాడిన ఆర్. కృష్ణయ్య.. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతో కీలకమని అన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. దీంతో అనేక మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ చదువును కొనసాగించేందుకు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై పలు



హామీలు ఇచ్చినా, ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిష్కారం చూపలేదని ఆర్. కృష్ణయ్య విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇకపై ఆలస్యం చేయకుండా పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. చదువుకోవాల్సిన విద్యార్థులు ఫీజుల కోసం ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలను చెల్లించకపోతే విద్యార్థుల తరఫున రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు.



# సచివాలయాన్ని ముట్టడించిన మాల నేతలు

## - జీవో 99 రద్దు చేసి రోస్టర్ విధానం సవరించాలి

గీసుగొండ, ఆగస్టు 31, హైదరాబాద్ ఎస్టేట్:
ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మాల నేతలు రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడించారు. వర్గీకరణకు సంబంధించిన జీవో 99ను రద్దు చేసి, రోస్టర్ విధానాన్ని సవరించి 16వ సంఖ్య వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన ఆందోళనలో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి తుప్పరి నరసింహస్వామి మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో మాల, మాదిగలను విభజించి దళితులకు అన్యాయం చేయడం సరికాదన్నారు. దళితులకు రిజర్వేషన్లు పెంచాలే తప్ప వర్గీకరణ పేరుతో హక్కులను దెబ్బతీయవద్దని ప్రభుత్వాన్ని కోరారు. జీవో 99ను రద్దు చేసి రోస్టర్ విధానాన్ని సవరించడంతో పాటు మాలలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఆందోళనలో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు పశువుల లక్ష్మీనారాయణ, వంగేటి ప్రభాకర్, గీసుగొండ మండల అధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవన్ సెమినార్ విజయవంతం చేయాలి

## - ర్యాలీకి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి: -ఎస్ఎఫ్ఐ



**పరకాల, ఆగస్టు 31, హైదరాబాద్ ఎస్టేట్:**
పరకాల అంబేద్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించనున్న సెమినార్, ర్యాలీని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐషి ఘోష్ హాజరుకానున్నట్లు తెలిపారు. పరకాల పట్టణంలో సోమవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కళ్యాణ్ మాట్లాడుతూ ఢిల్లీలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ చేపట్టిన పోరాటం విజయవంతమైన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందన్నారు. సెమినార్, ర్యాలీకి విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బొజ్జ హేమంత్, విజయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో తప్పులు సరిచూసుకోవాలి

## - ఎస్ఐఆర్-2లో పేర్లు, వివరాలను పరిశీలించండి: బీజేపీ



**వరంగల్, ఆగస్టు 31, హైదరాబాద్ ఎస్టేట్:**
సమగ్ర ఓటరు సర్వే--2026లో భాగంగా రూపొందించిన ప్రత్యేక ఓటరు ముసాయిదా జాబితాలో నమోదైన వివరాలను ప్రతి ఓటరూ పరిశీలించుకుని తప్పులు ఉంటే సరిచేసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల రంజిత్‌కుమార్ సూచించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం 27వ డివిజన్ అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్-2 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బూత్ నంబర్ 154లో 276, బూత్ నంబర్ 155లో 209 మంది ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఇంటిపేరు, పేరు, తల్లి, తండ్రి పేర్లలో తప్పులు ఉన్న ఓటర్లకు సవరణ కోసం నోటీసులు అందజేశారు. ఓటరు జాబితాలో తమ పేరు, కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించుకోవాలని రంజిత్‌కుమార్ సూచించారు. తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్ఓ రవళి, బీఎల్ఏ-2 తమ్మిశెట్టి క్రాంతికుమార్, కుడికాల కుమారస్వామి, సుర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# ఒకే రోజున మూడు మధుర ఘట్టాలు

**- జన్మదినం.. పదవీ విరమణ.. దంపతుల షష్టిపూర్తి - మూడు దశాబ్దాల విద్యా సేవలకు కుడికాల సుభాష్‌కు ఘన వీడ్కోలు**

గీసుగొండ, ఆగస్టు 31, హైదరాబాద్ ఎస్టేట్:
జన్మదినం.. మూడు దశాబ్దాల విద్యా సేవలకు పదవీ విరమణ.. అదే రోజు దంపతుల షష్టిపూర్తి.. ఒకే రోజున మూడు మధుర ఘట్టాలు కలిసిరావడంతో గీసుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కుడికాల సుభాష్ జీవితంలో ఆగస్టు 31 చిరస్మరణీయంగా నిలిచింది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే ధ్యేయంగా సుదీర్ఘకాలం సేవలందించిన సుభాష్‌కు పాఠశాల ప్రాంగణంలో ఘన సన్మానం నిర్వహించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, శ్రేయోభిలాషుల సమక్షంలో సుభాష్--సుజాత దంపతుల షష్టిపూర్తి వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. గీసుగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సన్మాన సభకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు జుక్కోజు పద్మ అధ్యక్షత వహించారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్, రాష్ట్ర కార్యదర్శి కె. రంజిత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి డి. రంగయ్య నాయుడు, గీసుగొండ మండల విద్యాశాఖాధికారి కె. రవీందర్, గీసుగొండ సర్పంచ్ వి. రాజకుమార్, మమత, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కుమార్, గీసుకొండ ఉప సర్పంచ్ కోట ప్రమోద్, సృజన్ ప్రసాద్ తదితరులు పాల్గొని సుభాష్ సేవలను కొనియాడారు. 1995 మే 27న ఉపాధ్యాయుడిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన సుభాష్ 1998 డీఎస్సీ ద్వారా ఎంపికయ్యారు. కంటాయపాలెం, చెర్లపాలెం, ధర్మారావుపేట, గురుజాల, మారేడుపల్లి, కోనాయిపాలెం, చెన్నారావుపేట,



ఎల్లూరు రంగంపేట తదితర ప్రాంతాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అనేక మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పారు. విద్యారంగంలో చూపిన నిబద్ధతకు గుర్తింపుగా 2013లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించి, గీసుగొండ జడ్పీ ఉన్నత పాఠశాల బాధ్యతలు చేపట్టారు. గీసుగొండ పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల మెరుగుదల, క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి సారించారని వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ విద్యార్థులను ప్రోత్సహించి పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. బోధనతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నైతిక విలువలు, బాధ్యతాయుత ప్రవర్తన పెంపొందించేందుకు కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సుభాష్ ఇచ్చిన సందేశం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మార్కులు సాధించడం ఒక్కటే విద్యార్థి విజయానికి కొలమానం కాదని, జ్ఞానం, క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వం కలిసినప్పుడే జీవితంలో నిజమైన విజయం సాధ్యమని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించే వరకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. వైఫల్యాలకు భయపడకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలని, ఇతరులతో పోల్చుకుని నిరుత్సాహపడకుండా తమలోని ప్రతిభను గుర్తించాలని చెప్పారు. "ఈరోజు మీరు చేసే కృషే రేపటి మీ జీవితాన్ని నిర్ణయిస్తుంది. చదువును కేవలం ఉద్యోగం కోసం కాకుండా మంచి మనిషిగా, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా ఎదగడానికి సాధనంగా భావించాలి. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ, నిజాయితీ, మానవత్వం, క్రమశిక్షణను జీవితంలో భాగం చేసుకోవాలి" అని విద్యార్థులకు హితవు పలికారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని జ్ఞానాన్ని పెంచుకునేందుకు ఉపయోగించుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి వారి ఆశయాలకు అనుగుణంగా ఎదగాలని, గురువుల మార్గదర్శకత్వాన్ని గౌరవించాలని చెప్పారు. కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. జన్మదినం, పదవీ విరమణ, షష్టిపూర్తి మూడు వేడుకలు ఒకే వేదికపై జరగడంతో కార్యక్రమం ప్రత్యేకతను సంతరించుకుంది. సుభాష్--సుజాత దంపతులను అతిథులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, శ్రేయోభిలాషులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఆలపించిన ప్రార్థనా గీతాలు, స్వాగత నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలువురు ఉపాధ్యాయులు సుభాష్‌తో తమకున్న అనుబంధాన్ని



గుర్తుచేసుకుని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గీసుగొండ పీఆర్టీయూ అధ్యక్షుడు మార్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బల్లాం రవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కుల్లూరి వెంకటేశ్వర్లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నమ్రత, నల్లబెల్లి మండలంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ణకంటి రామ్మూర్తి, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉద్యోగ బాధ్యతలకు విరమణ ఉన్నా.. గురువు ముద్రకు విరమణ ఉండదు. మూడు దశాబ్దాలకు పైగా విద్యార్థుల జీవితాల్లో జ్ఞానాన్ని నింపి, విలువలను నేర్పి, పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన కుడికాల సుభాష్ సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని పలువురు పేర్కొన్నారు. జన్మదినం, పదవీ విరమణ, దంపతుల షష్టిపూర్తి ఒకే రోజున జరుపుకోవడం ఆయన జీవితంలో మధుర జ్ఞాపకంగా నిలిచిపోయింది.

## 420 మోసాలపై సమరానికి బీఆర్ఎస్ సన్నద్ధం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 31:-
ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న "కాంగ్రెస్ 420 మోసాలపై పోరుబాట" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమై పోరుబాట కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో జాప్యం చేస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, దాదాపు 1000 రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని సూచించారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "పోరుబాట" కార్యక్రమాలను ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు ప్రత్యేక



కార్యాచరణ రూపొందించారు. ప్రతి గ్రామంలో ప్రజలను కలుసుకుని కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, విధానాలు, స్థానిక సమస్యలు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించాలని నాయకులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే వైఖరిపై కూడా ప్రజల్లో విస్తృతంగా చర్చ జరిగేలా కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ నాయకత్వం దిశానిర్దేశం చేసింది. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ "కాంగ్రెస్ 420 మోసాలపై పోరుబాట"ను విజయవంతం చేయాలని కిషన్ రెడ్డి కోరారు

## లోక్ అదాలత్‌పై సమన్వయ భేటీ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 31:-
ఆమనగల్లు: సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఆమనగల్లు కోర్టులో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. సోమవారం సాయంత్రం 4:30 గంటలకు గౌరవ న్యాయ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ (జీవీఖీజ) అరుణ్ కుమార్ నారం అధ్యక్షతన ఈ సమావేశం



నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులకు సత్వర పరిష్కారం చూపేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ముఖ్యంగా చట్టపరంగా రాజీ చేసుకునే అవకాశం ఉన్న కాంపౌండబుల్ కేసులు, అడ్మిషన్ కేసులు, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పీటీ కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని మేజిస్ట్రేట్ సూచించారు. ఈ సమావేశానికి ఆమనగల్లు ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు, ఆమనగల్లు, కడ్తాల్, మడ్గుల, తలకొండపల్లి పోలీస్ స్టేషన్లకు చెందిన ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, సీడీఓ అధికారులు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. కార్తీక్, ఆమనగల్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తదితరులు హాజరయ్యారు. పెండింగ్ కేసుల వివరాలను సమగ్రంగా పరిశీలించి, లోక్ అదాలత్‌కు అర్హత ఉన్న కేసులను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. సంబంధిత కేసుల్లోని పక్షాలతో ముందుగానే సంప్రదింపులు జరిపి, రాజీ ద్వారా పరిష్కారానికి అవకాశం ఉన్న అంశాలను గుర్తించాలని తెలిపారు. పోలీసు, ప్రాసిక్యూషన్, ఎక్సైజ్, న్యాయ విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే కేసుల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని మేజిస్ట్రేట్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనంత ఎక్కువ అర్హత కలిగిన కేసులను పరిష్కరించడమే లక్ష్యంగా అధికారులు సమష్టిగా పనిచేయాలని సూచించారు

## కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలన పై బీఆర్ఎస్ సమరభేరిని విజయవంతం చేద్దాం

**- సెప్టెంబర్ 2 నుండి 9 వరకు ఎనిమిది రోజుల పాటు 6 గ్యారెంటీలు, 420 హామీల కాంగ్రెస్ బూటకపు పాలనను నిలదీద్దాం!**

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ గారు గౌరవ మాజీ మంత్రి బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల శాసనసభ్యులు శ్రీ కేటీ ఆర్ గారి పిలుపు మేరకు దాస్యం వినయ్ భాస్కర్ గారు హనుమకొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసి కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై పోరుబాటకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినారు.
అనంతరం దాస్యం వినయ్ భాస్కర్ గారు మాట్లాడుతూ
సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ చేసిన మోసాల పై బీఆర్ఎస్ పార్టీ పోరుబాట చేపట్టాలి అని అన్నారు.
వారం రోజుల పాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.
420 హామీల మోసంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని వెయ్యి రోజులైనా ఇప్పటివరకు నెరవేరని హామీల పై ప్రజలను చైతన్యవంతం చేయడమే కాకుండా కాంగ్రెస్ హామీల వైఫల్యం,అవినీతిని ఎండగట్టి విస్తృతంగా ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని నాయకులకు సూచించారు.
420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి...వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి...తర్వాత అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000 రోజులు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యాచరణకు సిద్ధమైంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు సమాజంలోని అన్ని రంగాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున వినూత్నంగా తీసుకెళ్లేందుకు సిద్ధమవ్వాలి అన్నారు..
కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన మోసాలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి చేరేలా ఈ వారం రోజుల కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.
ఆయా వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల తాలూకు బకాయిలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.
ఈ 1000 రోజుల్లో ప్రభుత్వం ఎన్ని రంగాల్లో వైఫల్యం చెందిందో, ఎన్ని రంగాల్లో అట్టర్‌ఫ్లాప్ పరిపాలన సాగించిందో ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి గారు, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ ప్రెసిడెంట్లు,లీగల్ సెల్ బాధ్యులు, మహిళా డివిజన్ ప్రెసిడెంట్లు, విద్యార్థి విభాగం నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు..



## మంత్రులతో కలిసి పలు అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే KR నాగరాజు



హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో పలు అభివృద్ధి పనులకోసం విచ్చేసిన రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార,పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా ఒ శిశు సంక్షేమ శాఖా మంత్రి వర్యులు సీతక్క గారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి గారు, ఎంపీ బలరాం నాయక్ గార్లను మర్యాదపూర్వకంగా కలిసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు. అనంతరం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం మరియు నూతన మున్సిపల్ భవన నిర్మాణ భూమి పూజ, పలు అభివృద్ధి పనుల కార్యక్రమంలో సహచర ఎమ్మెల్యేలతో కలసి పాల్గొని.అనంతరం కేసముద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంతో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ నేతల విమర్శలకు ఆధారాల్లేవు..

# వరంగల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధం

## పదేళ్ల పాలనలో చేయనిది.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో చేసి చూపించింది

## -వరంగల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను ప్రజలు నమ్మొద్దు: ఎమ్మెల్యే నాయిని...

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
తేదీ :31/08/2026–సోమవారం
డిసిసి భవన్ -హనుమకొండ.

హనుమకొండ: కాంగ్రెస్ పార్టీని విమర్శించడమే రాజకీయంగా పెట్టుకున్న కొందరు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వాస్తవాలు తెలుసుకోకుండా, విషయం లేని ఆరోపణలు చేయడం సరికాదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి  గారు అన్నారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే గారు మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే తప్ప తమకు పూట గడవదన్నట్టుగా కొందరు నేతలు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే నాయిని మండిపడ్డారు. వచ్చీరాని భాషతో, సబ్జెక్ట్ లేని కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ విమర్శలు చేయాలంటే ఆధారాలతో, వాస్తవాలతో మాట్లాడాలని సూచించారు.గత ప్రభుత్వాల హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్న విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని నాయిని అన్నారు. ఉద్యోగులు, ప్రభుత్వ వ్యవస్థలకు సంబంధించిన అనేక అంశాలను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటోందన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కూడా బీజేపీ నేతలు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశంపై చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరంగల్ అభివృద్ధికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు సుమారు రూ.5,300 కోట్లు, శాశ్వత తాగునీటి వసతుల కోసం రూ.550 కోట్లకు పైగా నిధులతో పనులు చేపడుతున్నామని  చెప్పారు.నగర ప్రజలకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. నిజాం కాలం నాటి ఫిల్టర్ బెడ్ల స్థానంలో ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, పాత పైప్‌లైన్ల సామర్థ్యాన్ని కూడా పెంచుతున్నామని చెప్పారు.వరంగల్ ఎయిర్‌పోర్ట్ అంశంపై గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని నాయిని అన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు ఎయిర్‌పోర్ట్‌కు కనీసం అనుమతులు తీసుకురాలేదని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన అనుమతుల కోసం కృషి చేయడంతో పాటు భూసేకరణకు భారీగా నిధులు కేటాయించి ముందుకు తీసుకెళ్లిందన్నారు.

వరంగల్ అభివృద్ధిలో భాగంగా రింగ్‌రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల అభివృద్ధికి ఇటీవల రూ.25 కోట్లు మంజూరు చేయించామని, పాలిటెక్నిక్ కళాశాల కోసం కూడా నిధులు తీసుకొచ్చామని చెప్పారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నారని, తాను అడిగిన అభివృద్ధి పనులకు సానుకూలంగా స్పందిస్తున్నారని నాయిని పేర్కొన్నారు.

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని నాయిని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం భూసేకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, విభజన చట్టంలో ఉన్న హామీని అమలు చేసే దిశగా ముందుకు వెళు _న్నామని చెప్పారు.

కాజీపేట, వరంగల్ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చర్చకు రావాలని, గత పదేళ్లలో వారు ఏం చేశారో, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేసిందో ప్రజల ముందే తేల్చుకుందామని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర తెలియకుండా కొందరు నేతలు విమర్శలు చేస్తున్నారని నాయిని అన్నారు. దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అనేక సంస్థలను, ప్రభుత్వ రంగ వ్యవస్థలను దేశ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించాయని, వాటిని ప్రైవేటీకరణ పేరుతో విక్రయించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు నేతలు ప్రజల్లోకి వచ్చి రాజకీయాలు చేయడం ప్రారంభించారని నాయిని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజల మధ్యకు వచ్చే సీజనల్ రాజకీయ నాయకులను ప్రజలు నమ్మవద్దని కోరారు.

వరంగల్ జిల్లా అభివృద్ధిపై ప్రజలు గత పదేళ్ల పాలనను, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని సూచించారు. "మీ కళ్ల ముందే జరుగుతున్న అభివృద్ధిని చూసి నిర్ణయం తీసుకోండి. ఆధారాలు లేని ఆరోపణలను నమ్మొద్దు" అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజల సంక్షేమం కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వాలే తీసుకొచ్చాయని, కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా ప్రజలకు సంక్షేమాన్ని అందించడమే కాంగ్రెస్ విధానమని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో టీఆర్ఎసి ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్



రెడ్డి,టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు జక్కుల రవిందర్, పోతుల శ్రీమాన్, గుంటీ శ్రీనివాస్, మామిళ్ల రాజు, నెక్కొండ కిషన్,జిల్లా నాయకులు బంకా సరళ, బంకా సాంపత్ యాదవ్, అంబేద్కర్ రాజు, అంకుస్,తోట రాజ్ కుమార్,మార్కు విజయ్, కూర వెంకట్ ,పెరుమాండ్ల రామకృష్ణ,పులి రాజు , ఆరూరి సాంబయ్యా, కట్ల శ్రీనివాస్,వీరగంటి రవీందర్,గుంటి స్వప్న , రహిమున్నీసా,తడుక సుమన్,సుమన్ ,అనిల్ , అశోక్ రెడ్డి , ఆజాం, క్రాంతిబరత్, కొండ నాగరాజు, రహమతుల్లా,దొంగల కుమార్ తదితరులు పాల్గొన్నారు

---

# సంచార జాతుల విముక్తి దినోత్సవం ఘనంగా నిర్వహణ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 31:-
రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంచార జాతుల 75వ విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంచార జాతుల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు.

కార్యక్రమంలో సంచార జాతుల సమస్యలు, వారి జీవన పరిస్థితులు, విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి అంశాలపై చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యకు దూరంగా ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించి, వారికి మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సంచార, విముక్త జాతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన వారికి ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు చొరవ చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంచార జాతుల నాయకులు కుమార్ మహేంద్ర, ఓంప్రసాద్



తదితరులు పాల్గొని సంచార, విముక్త జాతుల హక్కులు, వారి చారిత్రక నేపథ్యం, సామాజిక అభివృద్ధిపై మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, సంచార జాతుల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పామ్ ఆయిల్ తోటలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

చిట్యాల: వ్యవసాయ భూమిలో పామ్ ఆయిల్ చెట్లకు అత్యంత దగ్గరగా ఉన్న విద్యుత్ తీగలను సురక్షిత దూరానికి మార్చాలని కోరుతూ రామ్‌నగర్ కాలనీకి చెందిన శీలపాక సరోజన, శీలపాక రాజు చిట్యాల విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. చిట్యాల గ్రామ పరిధిలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం ఎదుట సర్వే నంబర్లు 5/1, 5/2లో మొత్తం 4 ఎకరాల 4 గుంటల వ్యవసాయ భూమిలో పామ్ ఆయిల్ సాగు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ తీగలు చెట్లకు దగ్గరగా ఉండటంతో ప్రమాదకర పరిస్థితి నెలకొన్నదని, ఇటీవల శీలపాక నర్సయ్యకు విద్యుత్ షాక్ తగిలిన ఘటన కూడా జరిగిందని




పేర్కొన్నారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు.మూడు నెలల క్రితం గాలులకు విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా, ప్రస్తుతం మరమ్మతు పనుల్లో భాగంగా ఐదు కొత్త స్తంభాలు, పాత సర్వీస్ వైర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అవసరమైతే అదనపు స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేసేందుకు అయ్యే ఖర్చును తామే భరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. విద్యుత్ లైన్‌ను పామ్ ఆయిల్ చెట్లు, వ్యవసాయ పనులు చేసే వారికి ప్రమాదం కలగకుండా సురక్షిత దూరానికి అత్యవసరంగా మార్చాలని వారు కోరారు.

# హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు చాలా ఇబ్బందిగా మారుతున్నది.

ఫుట్ ఫాత్ ల ఆక్రమణ, తోపుడు బండ్ల పై రోడ్డు మీదే వ్యాపారం,  ఇంటికో కారు, ఆటోలు క్యాబ్ లు, మితిమీరిన ద్వి చక్ర వాహనాలు, రోడ్డు పైనే పార్కింగ్ లు ఇవన్నీ కలిసి ట్రాఫిక్ వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నాయి.

ఉదయం సాయంత్రం రాత్రి వేళల్లో ఈ పరిస్థితి మరింత ఇబ్బందిగా మారుతున్నది.

ముఖ్యంగా రాత్రి పది తర్వాత కూకట్ పల్లి నుంచి ఎల్బి నగర్ వరకు, లకిడికా పూల్ నుంచి గచ్చిబౌలి  వరకు పక్క రాష్ట్రాలకు  వెళ్లే ప్రైవేట్ బస్సులతో నగర ప్రయాణం ప్రాణాంతకంగా మారుతున్నది.ఫుట్ పాత్, తోపుడు బండ్ల పై వ్యాపారాలను తొలగించి వారికి ప్రత్యామ్నాయంగా మెయిన్ రోడ్ పక్కనున్న సందుల్లో, వీధుల్లో ఇబ్బంది లేని మార్గాల్లో అవకాశం కల్పించాలి.

వీలైతే రైతు బజార్ ల మాదిరిగా, వారానికో వీధుల్లో, సంతల్లో వీరికి అవకాశం కల్పించాలి.

ఇక రాత్రి పూట ప్రయాణించే ప్రైవేట్ బస్సులకు నగరం ముఖ్య రహదారుల్లో కాకుండా ముంబాయి , పుణె , షిర్డీ ఆ వైపు ప్రాంతాలకు కూకట్ పల్లి నుంచి, ఓల్డ్ బొంబాయి రోడ్ మెహదిపట్నం  షేక్ పేట్ నుంచి బయలుదేరేలా, ...

జనగామ వరంగల్ వెళ్ళే బస్సులను ఉప్పల్ నుంచి వెళ్లేలా, ...

నిజామాబాద్, కరీంనగర్ వైపు వెళ్ళే బస్సులను జూబ్లీ బస్ స్టాండ్ నుంచి

శ్రీశైలం కర్నూలు వెళ్ళే బస్సులను రాజేంద్ర నగర్ నుంచి , ...

విజయవాడ ఒంగోలు నెల్లూరు వైపు  ప్రాంతాలకు వెళ్ళే బస్సులను ఎల్బి నగర్  నుంచి వెళ్లేలా చూస్తే నగర ట్రాఫిక్ చాలా వరకు తగ్గుతుంది. ఆయా బస్సులను నగరంలోకి రానివ్వకుండ శివారు ప్రాంతాల నుంచే వెళ్లేలా ట్రాఫిక్ అధికారులు ఆదేశాలు ఇవ్వాలి.

ఇవి నా ఆలోచనకు వచ్చిన చిన్న సూచనలు. ఇవే కాకుండా నగర ట్రాఫిక్ ను తగ్గించే ఇతర అవకాశాలను.  మార్గాలను కూడా ఆలోచించాలని నగర్ పోలీస్ కమిషనర్ గారికి, ట్రాఫిక్ పోలీస్ అధికారులకు మనవి.



# మల్లన్న బోనాలు -- పోచమ్మ బోనాల ఉత్సవంలో మొహబ్బత్‌నగర్ గ్రామ సర్పంచ్ వర్త్య రాజు నాయక్

హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 31
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మోపత్ నగర్ గ్రామంలో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోనాల కార్యక్రమంలో సర్పంచ్ వర్త్య రాజు నాయక్ మాట్లాడుతూ మోహబత్ నగర్  గ్రామంలో మల్లన్న పోచమ్మ అంగరంగ వైభవంగా జరిగాయని మల్లన్న పోచమ్మ దీవెనలు గ్రామంలో అందరి పైన ఉండాలని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించామని గ్రామ ప్రజలు ఆయుధ ఆరోగ్యాలతో ఐశ్వర్యాలతో ఉండాలని అన్నారుఈ కార్యక్రమంలో సర్పంచ్ వర్త్య రాజు నాయక్, ఉప సర్పంచ్ నల్లవోలు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు అమ్గోత్ శ్రీను, గోడుకొండ్ల అంజయ్య, కేతావత్ శ్రీనివాస్, కేతావత్ మంజుల, కొర్ర శోభ, యాట ప్రవళిక, సుర్నగంటి రాణి పాల్గొన్నారు.అలాగే ×చీఖజ శివ యాదవ్, వర్త్య కీమా, గ్రామ అధ్యక్షులు, మారేమోని శ్రీరాములు యాదవ్ (మాజీ వార్డు సభ్యులు), సయ్యద్ అర్షద్ (దీ=ూ గ్రామ అధ్యక్షులు), పాపా నాయక్, శేఖర్ (మాజీ వార్డు సభ్యులు), నాగభూషణం,ూాజు ఫకీరా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన బెల్లంపల్లి ఏసీపి కిరణ్ కుమార్.




హైదరాబాద్ ఎస్టేట్ 31ఆగస్టు
రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపి కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలను నిరంతరం పర్యవేక్షించడంలో భాగంగా ఏసీపీ ఈ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతను పాటించాలని సూచించారు. వివిధ నేరాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా ఉంచాలని ఎస్ఐ శ్రీధర్ ని ఆదేశించారు. రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాద పూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న



రికార్డులు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు.అనంతరం ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, రికార్డులను సక్రమంగా అప్‌లోడ్ చేయడం వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ తనిఖీలో మందమరి సర్కిల్ ఇన్స్పెక్టర్ పోలీస్ పి రమేష్ పాల్గొన్నారు.



# వెండితెరపై చెరగని సంతకం..

# హీరో సుమన్



**యాక్షన్ హీరోగా ఎంట్రీ.. విభిన్న పాత్రలతో ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానం**

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

హైదరాబాద్: తెలుగు సినీ పరిశ్రమలో తనదైన నటనా శైలితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు హీరో సుమన్. దక్షిణాది చిత్ర పరిశ్రమలో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయకుడిగా.. ఇలా విభిన్న పాత్రల్లో నటించి తనకంటూ ప్రత్యేక అభిమాన వర్గాన్ని సంపాదించుకున్నారు.

**నటనపై ఆసక్తితో.. వెండితెరకు సుమన్ సినీ ప్రస్థానం**

యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. తొలి దశలో యాక్షన్ కథా చిత్రాల్లో హీరోగా మెప్పించిన ఆయన.. అనంతరం కథకు, పాత్రకు ప్రాధాన్యతనిస్తూ విభిన్నమైన పాత్రలను స్వీకరించారు. తన శారీరక దారుఢ్యం, డైలాగ్ డెలివరీ, హావభావాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

**విభిన్న పాత్రలతో ప్రత్యేక గుర్తింపు**

హీరోగా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించిన సుమన్.. కాలక్రమంలో తన పాత్రల పరిధిని విస్తరించారు. కుటుంబ కథా చిత్రాలు, యాక్షన్ సినిమాలు, భక్తిరస చిత్రాలతో పాటు చారిత్రక, సామాజిక నేపథ్య చిత్రాల్లోనూ నటించారు.



ముఖ్యంగా భక్తిరస చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందాయి. పాత్ర ఏదైనా దానికి న్యాయం చేయాలనే తపన ఆయన నటనలో కనిపిస్తుందని అభిమానులు చెబుతుంటారు.

**'అన్నమయ్య'తో మరో మైలురాయి**

తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న 'అన్నమయ్య' చిత్రంలో సుమన్ పోషించిన శ్రీ వేంకటేశ్వర స్వామి పాత్ర ఆయన సినీ జీవితంలో ఒక ముఖ్యమైన మలుపుగా నిలిచింది. ఆ పాత్రలో ఆయన కనిపించిన తీరు ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది.

ఈ చిత్రంతో భక్తిరస పాత్రల్లోనూ తన నటనా సామర్థ్యాన్ని సుమన్ చాటుకున్నారు. అనంతరం పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తూ తన ప్రస్థానాన్ని కొనసాగించారు.

**అవార్డులు.. అభినందనలు**

సినీ రంగంలో సుమన్ అందించిన సేవలకు పలు పురస్కారాలు, సత్కారాలు లభించాయి. ఆయన నటనా ప్రతిభకు ప్రేక్షకుల ఆదరణతో పాటు సినీ వర్గాల నుంచి కూడా ప్రశంసలు దక్కాయి. దక్షిణాది చిత్ర పరిశ్రమలో సుదీర్ఘకాలం కొనసాగుతూ అనేక తరాల ప్రేక్షకులను అలరించడం ఆయన ప్రత్యేకత.

**నేటి తరానికీ స్ఫూర్తి**

సినిమా రంగంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా తన ప్రయాణాన్ని కొనసాగించిన సుమన్.. నేటి యువ నటులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. పాత్రల ఎంపికలో వైవిధ్యాన్ని చూపిస్తూ ఇప్పటికీ తన ఉనికిని చాటుకుంటున్నారు.

సినిమా అనేది కేవలం పేరు, ప్రఖ్యాతి కోసం కాకుండా.. ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే పాత్రల కోసం అన్నట్లుగా సుమన్ తన సినీ ప్రయాణాన్ని కొనసాగించారు. అందుకే ఆయన పేరు తెలుగు ప్రేక్షకుల జ్ఞాపకాల్లో ప్రత్యేకంగా నిలిచిపోయింది.

**అభిమానుల గుండెల్లో ఎప్పటికీ 'హీరో సుమన్'**

ఒకప్పుడు యాక్షన్ హీరోగా అభిమానులను అలరించిన సుమన్.. ఆ తర్వాత క్యారెక్టర్ పాత్రలతోనూ ప్రేక్షకుల మన్ననలు పొందారు. 'గజ్జ గల్లుమన్నదో.. గుండె జల్లుమన్నదో..' వంటి పాటలతోనూ ఆయనకు ప్రత్యేకమైన అభిమానాన్ని సంపాదించుకున్న ప్రేక్షకులు, నేటికీ ఆయనను ఆప్యాయంగా గుర్తుచేసుకుంటున్నారు.

వెండితెరపై దశాబ్దాల ప్రయాణం.. ఎన్నో పాత్రలు.. ఎన్నో జ్ఞాపకాలు.. ఇలా తెలుగు సినీ చరిత్రలో హీరో సుమన్‌ది చెరగని అధ్యాయం అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

## లే అవుట్లలో మరియు అగ్రవర్ణాలు కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకొని పేదలకు పంచాలి.

**- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుబ్బు మాదిగ డిమాండ్.**

పల్నాడు,ఆగస్టు 31.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్న ఆదేశాలు మేరకు అదేవిదంగా రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి షాలేం రాజు అన్న ఆదేశాల మేరకు ఈరోజు పల్నాడు జిల్లా లో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం లో కలెక్టర్ ని పలు సమస్యలు మీద మెమోరాడం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సుబ్బు మాదిగ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో బడాబాబులు, రాజకీయ నాయకుల అండ దండలతో వెంచర్ల పేరు మీద ప్రభుత్వ భూమిని కబ్జా చేసి వెంచర్లు వేయడం జరిగింది అదేవిధంగా పల్నాడు జిల్లా లో బలహీనలు పేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూమి ని కబ్జా చేసుకొని సాగు చేసుకుంటున్న ఆధిపత్య వర్గాల వారి మీద చర్యలు తీసుకోవాలి అని అదేవిదంగా పల్నాడు జిల్లా ఒక స్పెషల్ ఆఫీసర్ ని నియమించి పల్నాడు జిల్లాలో ఉన్న పేద వర్గాలకు న్యాయం చేయాలని మాట్లాడటం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు జమ్మలమూడి విజయ మాదిగ మాల మహానాడు నాయకులు సంగుల చిన్నోడు పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కందుల జార్జ్ మాదిగ పలువురు పాల్గొన్నారు

## తెలంగాణ శాసన సభ అంచనాల కమిటీ సమావేశం ఘనంగా నిర్వహణ.








✓, తెలంగాణ, ఆగస్టు 31.

తెలంగాణ రాష్టం శాసన సభ అంచనాల కమిటి చైర్మెన్ గా ఎమ్మెల్యే కోరం కనకయ్య భాధ్యతలు స్వీకరణ.ప్రజా అవసరాలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ నిధుల సద్వినియోగమే లక్ష్యం-ఎమ్మెల్యే కనకయ్య.తెలంగాణ రాష్ట్ర శాసన సభ అంచనాల కమిటీ చైర్మెన్ గా రాష్ట శాసన సభ కార్యాలయం నందు భాధ్యతలు స్వీరకణ అనంతరం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన సమావేశం ఘనంగానిర్వహించబడింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ హాజరై కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపులు, వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ అంచనాలు--వ్యయాలపై సమగ్రంగా చర్చించి, ప్రజలకు మరింత మెరుగైన పాలన మరియు అభివృద్ధి ఫలాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చ జరిగింది.ఈ సమావేశంలో అంచనాల కమిటి సభ్యులు, సహచర ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, సుదీర్ రెడ్డి, ఎమ్మెల్సీ యదవ రెడ్డి, శాసన సభ, శాసన మండలి ప్రధాన అధికారులు తదితరులు పాల్గోన్నారు.

## రోడ్డు ప్రమాదంలో శ్రీలక్ష్మి మృతి..

### కుటుంబాన్ని పరామర్శించిన కోన రఘుపతి



బాపట్ల, ఆగస్టు 31:

బాపట్ల మండలం సూర్యలంకకు చెందిన కొక్కిలిగడ్డ శ్రీలక్ష్మి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు.ఈ నెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీలక్ష్మి మృతి చెందిన విషయం తెలుసుకున్న కోన రఘుపతి, సోమవారం సూర్యలంకలోని ఆమె నివాసానికి వెళ్లారు. శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులను కలిసి ప్రమాదం జరిగిన తీరును, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు.శ్రీలక్ష్మి అకాల మరణం ఎంతో బాధాకరమని కోన రఘుపతి పేర్కొన్నారు. చిన్న వయసులోనే కుటుంబాన్ని విషాదంలోకి నెట్టిన ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆపద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారి వెంట తాను ఎల్లప్పుడూ ఉంటానని భరోసా కల్పించారు. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.అనంతరం శ్రీలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. కోన రఘుపతి పరామర్శతో కుటుంబ సభ్యులు కొంత ఊరట పొందారు.

## ఇల్లందు మండలంలో కాంగ్రెస్ నేతల విస్తృత పర్యటన.



✓,ఇల్లందు, ఆగస్టు 31.

ఇల్లందు మండలం కాంగ్రెస్ కమిటి అధ్యక్షుని అధ్వర్యంలో నూతన గ్రామ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం.గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతం, ప్రజా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేయడంపై నేతలు దృష్టి.ఇల్లందు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మండల రాంమహేష్ ఆధ్వర్యంలో మండలంలోనిపొచారం తండా, బోయితండా, మాణిక్యారం, ముత్తారపు కట్ట, రొంపేడు, మామిడి గుండాల, సి ఎస్ పి బస్తీ గ్రామాల్లోలి కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో విస్తృతంగా పర్యటిస్తూ నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీ ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ శాసన సభ్యులు కోరం కనకయ్య ఆదేశానుసారం గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువ కావడమే లక్ష్యంగా ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.ప్రతి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి వెన్నెముకగా నిలుస్తారని, కార్యకర్తల కష్టాన్ని, ప్రజల నమ్మకాన్ని గౌరవిస్తూ పార్టీని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సమిష్టిగా పనిచేయాలని నాయకులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు,జిల్లా కాంగ్రెస్ కమిటి ప్రధాన కార్యదర్శి ఎట్టి హరిక్రిష్ణ,జిల్లా కాంగ్రెస్ కమిటి సభ్యులు ఇస్లావత్ సతీష్,డిసిసిబి డైరెక్టర్ జనగం కొటేశ్వరరావు,ఇల్లందు ఎస్సి సెల్ మండల అధ్యక్షులు కాకటి భార్గవ్,నాయకులు మూతి క్రిష్ణ,పూనెం సురేందర్,పొచారం తండా సర్పంచ్ వాంకుడొత్ భారతి శ్రీను,చెన్నూరి శ్రీను,చెన్నూరి క్రిష్ణ,ఉపేందర్,పడిగ సంపత్,ధారవత్ తులిశ్యా,పాయం క్రిష్ణ ప్రసాద్,మోకాళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గోన్నారు.

